**ఈ రోజు (10.7.2021) జరిగిన సిపిఐ(యం) ప్రెస్‌మీట్ నోట్**

**పోలవరం నిర్వాసిత శిబిరాలు ఏర్పాటు చేయాలి**
**– ముంపు బాధితులను తక్షణమే ఆదుకోవాలి**
**– 16న ముంపు ప్రాంతాల్లో పర్యటన**
**– సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు**

పోలవరం ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు తక్షణమే పోలవరం నిర్వాసిత తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్యతో కలిసి విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పోలవరం కాఫర్‌డ్యాం నిర్మాణం వల్ల వేలాది మంది నిర్వాసితులవుతున్నారన్నారు. తక్షణమే వారికి నిర్వాసిత శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వీరి పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. పునరావాసం కోసం ఎటువంటి నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేయడమే దీనికి కారణమని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వ కాలంలో నిధులు సకాలంలో విడుదల చేయలేదని, ఇప్పుడు కూడా ఈ నిర్లక్ష్యమే కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం 34 గ్రామాలు ముంపుకు గురయ్యాయని, చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపు 8 మండలాల్లో ఉందని పేర్కొన్నారు. 3లక్షల మంది ప్రజలు నిర్వాసితులవుతున్నారని అన్నారు. నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చట్ట వ్యతిరేకమని అన్నారు. పోలవరం, దేవీపట్నం మండలాల్లో దాదాపు 35 గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తోందని తెలిపారు. పునరావాసం ఏర్పాటు చేయకుండానే కొన్ని గ్రామాలు ఖాళీ చేయించడం తీవ్ర తప్పిదమని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారని వెల్లడించారు. ముంపు ప్రాంత ప్రజలందరికీ తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా వారికి 3 నెలలకు సరిపడ నిత్యావసరాలు ఇవ్వాలని కోరారు. ముంపు వల్ల కొండలు, గుట్టలపై నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఆహారం, మంచినీరు, మందులు, టార్పాలిన్లు, 20లీటర్ల కిరోసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పునరావాసం బాధ్యత తమది కాదని వివాదాన్ని లేపిందని తెలిపారు. ప్రాజెక్టు వ్యయం పెరిగిన ధరలకు అనుగుణంగా రివైజ్ చేయడం, దాన్నీ వివాదంగా మార్చిందని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు విడుదల చేసి కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎపి విషయంలో కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అందరినీ కలుపుకుని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, ప్రాజెక్టు నిర్మాణం సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు పోలవరం ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోకుంటే 16న వామపక్షాలు, ఇతరులను కలుపుకుని పోలవరం, దేవీపట్నం ప్రాంతాల్లో పర్యటిస్తుందని హెచ్చరించారు.

ఎపి, తెలంగాణల మధ్య నెలకొన్న జలవివాదంలోనూ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఎపి ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాసినా, తెలంగాణ ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. జల వివాదాలు పెరిగేకొద్దీ మన కరువు పీడిత ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.